# వ్యర్థాలకు అర్థం

## రీ సైక్లింగ్‌తో అద్భుత ఫలితాలు

- భవన వ్యర్థాలను కరిగించి.. నాణ్యమైన ముడి సరుకు
- బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటైన సీ అండ్ డీ ప్లాంట్లు
- ఇప్పటివరకు 8.50 లక్షల మెట్రిక్ టన్నులు కరిగించి పునర్వినియోగం
- సిమెంట్ ఇటుకలు, టైల్స్ ఇసుక, కంకర తయారీ

భవన నిర్మాణ వ్యర్థాలకు సరికొత్త అర్థం చెబుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన సీ అండ్ డీ ( కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్ల నిర్వహణలో అద్భుత ఫలితాలను రాబడుతున్నది. గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి అపరిశుభ్రతకు నిలయాలు ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను ఒక చోటకు చేర్చి రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం) చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి పునర్ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు నగరం నలువైపులా నాలుగు చోట్ల జీడిమెట్ల, ఫతుల్లాగూడ, శంషాబాద్, తూంకుంటలో ఒక్కో కేంద్రంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంలో రీ సైక్లింగ్ ప్లాంట్లు నెలకొల్పారు.

– సిటీ బ్యూరో, మే 25
నమస్తే తెలంగాణ



### ఆధునిక టెక్నాలజీతో..

జీహెచ్ఎంసీ సారథ్యంలో 'రీ సస్టైనబులిటీ సంస్థ (రాంకీ)ఆధునిక వెబ్ టెక్నాలజీతో తొలుత జీడిమెట్ల కేంద్రం 2020 నవంబర్‌లో, ఫతుల్లాగూడ కేంద్రం 2021 జూన్‌లో అందుబాటులోకి వచ్చాయి. రెండేండ్ల కిందట శంషాబాద్, తూంకుంటలో ప్లాంట్లు అందుబాటులోకి రాగా...మొత్తంగా నాలుగు ప్లాంట్ల నుంచి ఇప్పటి వరకు 29.67 లక్షల మెట్రిక్ టన్నుల భవన వ్యర్థాలను తరలించారు. ఇందులో 8.28లక్షల మెట్రిక్ టన్నులను రీ యూజ్‌లోకి తీసుకువచ్చారు. నాణ్యతకు ఢోకా లేని బంక మట్టి, దొడ్డు కంకర, సన్న కంకర, దొడ్డు ఇసుక, సన్న ఇసుక , లోహాలు, ఇతరత్రా ముడి వస్తువులుగా మార్చారు. వాటిలో సిమెంట్, సిమెంట్ ఇటుకలు, టైల్స్, పేవర్ బ్లాక్స్, ప్రీకాస్ట్ కాంక్రీటు గోడలు, సిమెంట్ దిమ్మెలు ఇతరత్రా పరికరాలు తయారు చేయడం గమనార్హం.




### టోల్ ఫ్రీ నంబర్ 1800 120 1159

భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయడానికి వీల్లేదు.. నిర్మాణాలు చేపట్టే సమయంలో కానీ, ఇంటి మరమ్మత్తులు, ఆధునీకరణ చేసే సమయంలో వచ్చే వ్యర్థాలను జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లకు అప్పగించకుండా కొందరు ఖాళీ స్థలాలు, చెరువులు, నాలాల పక్కన పడేస్తున్నారు. ఇందులో భాగంగా 30 సర్కిళ్లలో ఏసీపీలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని గుర్తించి వారికి రూ. 1000 జరిమానా విధిస్తున్నారు. ఈ మేరకు 30 సర్కిళ్ల నుంచి గడిచిన మూడు నెలల కాలంలో రూ. 60 లక్షల మేర జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరం నలువైపులా భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం)లోకి తీసుకువచ్చేందుకు నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేయడం చేశామని, టోల్ ఫ్రీ నంబర్ 1800 120 1159లో, వాట్సప్ నంబరు 9100927073లో చెబితే సంబంధిత ఏజెన్సీ వారు వచ్చి వారి వారి ప్లాంట్లకు తీసుకువెళ్తారని కమిషనర్ ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

# ఫోర్త్ సిటీ వైపే మెట్రో మొగ్గు..!

జన సంచారం లేని ప్రాంతానికే ప్రాధాన్యం



- పనులు ముందుగా మొదలయ్యేది ఊహానగరి నుంచే..
- భూసేకరణ చిక్కులు ఉండవని భావిస్తున్న యంత్రాంగం

**ఎయిర్ పోర్టు- ఫోర్త్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మార్గం**

సిటీబ్యూరో, మే 25(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహా నగరి ఫోర్త్ సిటీపై ఉన్న ప్రేమ... నిత్యం లక్షలాది మందికి ఆవాసమైన నార్త్ సిటీపై లేదని తేలిపోయింది. జనసంచారమే లేని ఫోర్త్ సిటీ ప్రాంతంలో పనులు చేపట్టేందుకే చూపుతున్న ప్రాధాన్యత.. నార్త్ సిటీపై లేకపోవడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ఫేజ్-2లో నగరంలో మెట్రో విస్తరిస్తూ ఫోర్త్ సిటీకి కూడా డీపీఆర్‌పై ప్రకటన చేయగా, నార్త్ సిటీ జనాలు మాత్రం తమ ప్రాంతానికి మెట్రో ఎప్పుడంటూ ప్రశ్నిస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

### భూసేకరణ సులభం...

ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ వరకు నిర్మించనున్న 40 కిలోమీటర్ల మెట్రో మార్గానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తున్నది. ఈ ప్రాంతంలో భూసేకరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నది. ఇప్పటివరకు ప్రాథమిక నివేదిక ప్రకారం.. నార్త్ సిటీ కంటే వేగంగా ఫోర్త్ సిటీలో భూసేకరణ పూర్తవుతుందని మెట్రో వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఎట్ గ్రౌండ్ విధానంలో డెవలప్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధమైనట్లు తెలిసింది. ఓ వైపు గ్రీన్ ఫీల్డ్ హైవేకు భూసేకరణ జరుగుతున్న నేపథ్యంలో... ఆ భూముల్లోనే మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. కానీ నార్త్ సిటీలో హెచ్ఎండీఏ ప్రకటించిన ఎలివేటెడ్ కారిడార్ కు భూసేకరణకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తొలుత రెండు మార్గాల్లోనూ ఎలివేటెడ్ కారిడార్‌లో మెట్రో ఉంటుందని భావించినా... ఒక మార్గంలో సాధ్యం కాని నేపథ్యంలో... ఎలివేటెడ్, మెట్రో ప్రాజెక్టులను వేర్వేరుగా చేపట్టే అవకాశం కూడా ఉందని తెలిసింది.

### డీపీఆర్ సిద్ధం చేసి..

సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు ఊహానగరికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. ఈ ప్రాంతానికి జనసంచారమే లేకపోయినా కూడా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు మొగ్గుచూపుతున్నది. 30 లక్షల మంది నివాసితులు, 5–6 లక్షల మంది నిత్యం రాకపోకలు సాగించే నార్త్ సిటీ కంటే ఫోర్త్ సిటీలో మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం ఆసక్తి చూపుతున్నది. ప్రస్తుతం నార్త్ సిటీ, ఫోర్త్ సిటీకి డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదించాల్సి ఉంది.

# ఆటో డ్రైవర్ల ఆకలి కేకలు

### 27న ధర్నాచౌక్‌లో ధర్నా

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోస పూరిత వైఖరిని అవలంభించడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న ఇందిరాపార్క్ వద్ద గల ధర్నాచౌక్‌లో ఆటో కార్మికుల 'ఆకలి కేక'ల సభను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యూనైటెడ్ ఆటో ఒనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్, బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, రాష్ట్ర ఆటో జేఏసీ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఆటో కార్మికుల సమస్య లను పరిష్కారిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చల పేరుతో కాలయాపన చేస్తు న్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే పొన్నం ప్రభాకర్ దాట వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ఇది జీవన్మరణ పోరాటమని, లాటీలు, తుటాలు తగిలినా వెనుకడుగు వేసే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరుతూ గత నెల 27న ఆటో రథ యాత్ర చేపట్టి వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి జరుగుతున్న అన్యాయంపై ఆటో డ్రైవర్లకు తెలియజేశామన్నారు. సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహమద్ హబిబ్, ఏఐటీయూసీ నేత వెంకటేశ్వర్లు, టీయూసీఐ నేతలు ప్రవీణ్, లింగన్న గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య

# దోమల నివారణకు ముందస్తు ఫాగింగ్



సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ ): గ్రేటర్‌లో దోమల బెడద నివారణకు ఫాగింగ్ చర్యలు ముమ్మరం చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం ముందే దోమల బెడద నివారణ చేసి రానున్న వర్షాకాలంలో దోమల నివారణను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దోహద పడుతుందనే ఉద్దేశంతో పైలెట్‌గా కొన్ని సర్కిల్‌లో ఫాగింగ్ చర్యలను పెద్ద ఎత్తున చేపట్టినట్లు పేర్కొన్నారు. గోషామహల్ సర్కిల్‌లో దత్తాత్రేయ నగర్, మూసారం బాగ్ డివిజన్‌లో అరోరా కాలేజీ వెనుక భాగంలో ఫాగింగ్ చేపట్టినట్లు చెప్పారు. అంబర్ పేట డివిజన్‌లో పటేల్‌నగర్ న్యూ పటేల్‌నగర్ చెన్నారెడ్డి నగర్, కాకతీయ లైన్, బాబునగర్ పాలిటెక్నిక్ రోడ్డు, ఆకాశ్ నగర్ కుమార్ నగర్ ఓవైసీ నగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ చర్యల్లో ఎంటమాలజీ అధికారులు సిబ్బంది పాల్గొని ముమ్మరంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో వీఎంఎఫ్ యంత్రాల ద్వారా మరికొన్ని ప్రాంతాల్లో పీఎంఎఫ్ యంత్రాల ద్వారా ఫాగింగ్ చర్యలు పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. అలాగే సరూర్ నగర్ సర్కిల్ గడ్డి అన్నారం డివిజన్, కాప్రా సర్కిల్ లో వెంకటేశ్వర నగర్, మంగాపురం కాలనీ, కృష్ణ నగర్ కాలనీలో మీర్‌పేటల్లో సంబంధిత కార్పొరేటర్లతో కలిసి ఫాగింగ్ ప్రక్రియలో పాల్గొన్నట్లు వివరించారు.

# ప్రొఫెసర్ క్వార్టర్లు.. 30 ఏండ్ల లీజుకు..

- ఆది ధ్వని ట్రస్ట్ పేరిట రూ. వెయ్యి చొప్పున..
- హెచ్‌సీయూ భూ వివాదం మరువకముందే ఓయూలో వెలుగులోకి
- యూనివర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆగ్రహం



ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్ క్వార్టర్స్

సిటీ బ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను లీజుకిచ్చిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకవైపు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూ వివాదం కొనసాగుతుండగానే వర్సిటీలో అలాంటి ఉదంతమే బయటకు రావడం కలకలం రేపుతున్నది. ప్రొఫెసర్లు నివాసముండే క్వార్టర్స్‌ను ఆది ధ్వని ట్రస్ట్ అనే సంస్థకు లీజుకిచ్చారని ప్రొఫెసర్లు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వెనుక వైపు ఉన్న క్యాంపస్‌లోని మూడు క్వార్టర్లను కిరాయికి ఇచ్చినట్లు చెబుతున్నారు. ఒక్కో క్వార్టర్‌కు నెలకు రూ. వెయ్యి మాత్రమే అద్దె చెల్లించే విధంగా ఏకంగా..30 ఏండ్లకు లీజుకిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తతంగమంతా గతంలో వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ రవీందర్ ఆధ్వర్యంలో 2023లోనే జరిగిందని అంటున్నారు. లీజుకు ఇవ్వడానికి యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సెల్ కూడా అంగీకరించినట్లు ప్రొఫెసర్లు, విద్యార్థులు చెబుతున్నారు. యూనివర్సిటీ పరిధిలోని భూములను, భవనాలను లీజుకు, అద్దెకు ఇవ్వడానికి గానీ, అమ్మడానికి గానీ వీసీకి ఎలాంటి హక్కులు ఉండవని వారు అంటున్నారు. అయినా ఏకంగా ఎకరం విస్తీర్ణంలో ఉన్న మూడు క్వార్టర్లను ఎలా లీజుకిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అధికారులైన విద్యాశాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్న ఎగ్జిక్యూటివ్ సెల్ ఎలా ఆమోదం తెలిపిందని విద్యార్థులు నిలదీస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఏ ప్రాతిపాదికన లీజుకు ఇచ్చారో చెప్పాలని వీసీకి లేఖ రాసింది. అదేవిధంగా లీజుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని ప్రొఫెసర్లు ఆర్టీఐకి దరఖాస్తు సైతం చేసుకున్నారు.

**క్వార్టర్ల లీజు నిబంధనల ఉల్లంఘనే...**

యూనివర్సిటీలోని ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను లీజుకివ్వడం నిబంధనల ఉల్లంఘనే అవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ వీసీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. వర్సిటీలోని భూమిని ప్రైవేట్‌పరం చేయొద్దన్నారు. వర్సిటీకి చెందిన భూములు, భవనాలను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు లీజుకివ్వడం జస్టిస్ చిన్నప్పరెడ్డి కమిటీ నివేదికను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. లీజుకు తీసుకున్న ఆది ధ్వని ట్రస్టు 30 సంవత్సరాల దీర్ఘకాలిక కింద అదనపు క్వార్టర్లను కోరుతుండడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. లీజును వెంటనే రద్దు చేయాలన్నారు. లీజుకు తీసుకున్న ఆది ధ్వని ట్రస్ట్ వారు క్వార్టర్స్ రేనోవేషన్ పనులు చేస్తున్నారని, క్వార్టర్స్‌లో ఎలాంటి మరమ్మతులు చేయడానికి అనుమతులు ఉండవని చెప్పారు. లీజు రద్దు చేయకుంటే క్వార్టర్స్ పరిధిలోని ఎకరం భూమి అన్యాక్రాంతమయ్యే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

# మిస్ వరల్డ్ కోసం మెట్రో ప్రచారం

### అన్ని స్టేషన్లలో జోరుగా ప్రకటనలు




సిటీబ్యూరో, మే 25(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో స్టేషన్లు ప్రచార కేంద్రాలుగా మారిపోయాయి. మిస్ వరల్డ్ పోటీలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పిస్తూ స్టేషన్లు, ప్రాంగణాలు, మార్గాలను ఫ్లెక్సీలతో నింపివేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జరుగుతున్న తొలి కార్యక్రమం కావడంతో... అందాల పోటీలపై ప్రచార స్థాయిని పెంచుతూ ఏర్పాట్లు చేసినట్లు మెట్రో సంస్థ వెల్లడించింది. ఈ మేరకు మెట్రో మెట్ల ముఖ ద్వారాల వెంబడి తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ, బోనాలతో పాటు, తెలంగాణలోని ఆధ్యాత్మిక కేంద్రాలు, వాణిజ్య కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలతో కూడిన ఫ్లెక్సీలను నాగోల్ నుంచి హైటెక్ సిటీ వరకు, ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు అన్ని మార్గాల్లో ఇరువైపులా ఏర్పాటు చేశారు.

# నాగరికత నేర్పింది విశ్వకర్మలే..



చిక్కడపల్లి, మే 25: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాదుల పుష్పగిరి రచించిన 'గండదీపం- కవిత్వ' పుస్తకావిష్కరణ, విశ్వకర్మ యంగ్ లీడర్ అవార్డ్స్ ప్రధనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పుస్తకాన్ని ప్రముఖ కవి డా.అంబటి సురేంద్రరాజు, సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ.. సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మలేనని అన్నారు. పుస్తకంలో జీవిత అనుభవాలను కవిత్వంగా రాసారని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారి మాట్లాడుతూ.. మన తెలంగాణ మలి ఉద్యమ పోరాటంలో సకలజనులు చైతన్యమై పోరు సల్పారని ఇప్పుడు సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలని అన్నారు. తెలుగు సాహిత్యంలో ఆధునికంగా వినిపిస్తున్న గొప్ప కవుల జాబితాలో పుష్పగిరి కూడా వారి సరసన నిలబడే గొప్ప కవిత్వాన్ని రాస్తున్నారని ప్రశంసించారు. కుల వృత్తికులాల ఐక్యతకు ఈ కవిత్వం ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు శ్రీనివాస విశ్వకర్మ, ప్రధాన కార్యదర్శి సోలేటి ప్రభాకరాచారి, కే కిరణ్ కుమార్, గణేష్ బాబు పాల్గొన్నారు.

# గల్లంతు మతలబేంటి?

### గచ్చిబౌలి డివిజన్‌లో మెజార్టీ విద్యుత్ మీటర్లు మాయం

- కొన్నిచోట్ల ఎన్‌వోసీ లేకున్నా కేటగిరీ-1 కింద కేటాయింపు
- ప్రైవేట్ వ్యక్తులతో కలిసి తక్కువ బిల్లులు వేసిన వైనం
- లైన్‌మెన్ నుంచి అధికారుల వరకు అందరికీ వాటా..!
- ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్న డిస్కం
- లోతైన విచారణ జరిపిస్తే మరికొంత మందిపై వేటు పడే అవకాశం

సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి డివిజన్ పరిధిలో విద్యుత్ మీటర్ల గల్లంతుపై ఎస్‌పీడీసీఎల్ విచారణ నామమాత్రంగా జరుగుతోందనే విమర్శలున్నాయి. అయితే ఇది ఇంటిదొంగల పనే అని స్థానికంగా బలమైన టాక్ నడుస్తోంది. కాగా గల్లంతైన వాటిలో ఇటీవల 42 విద్యుత్ మీటర్ల దొరికినప్పటికీ ఎలా మాయమయ్యాయి, ఎక్కడ దొరికాయి అనే విషయం తెలుసుకునేందుకు కనీసం విచారణ కమిటీని వేయకుండా కేవలం ఒక ఏవో సహ ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేసి వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. నగర శివారల్లో ఇప్పటివరకు 225 మీటర్లలో మెజార్టీ మీటర్లు గల్లంతు అయినప్పటికీ అధికారులు మాత్రం కిమ్మనకుండా ఉన్నారు. అసలు ఈ వ్యవహారం వెనక బడా నేతలు ఉన్నారనే విమర్శలు సైతం లేకపోలేదు.

**మొదటి నుంచీ గందరగోళమే..!**

గండిపేట రెవెన్యూ సర్వే నెంబర్ 246 చిత్రపురి కాలనీలోని పలు నిర్మాణాలకు తెలుగు సినీవర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో జనవరి 7న 42 విద్యుత్ మీటర్లు జారీ అయ్యాయి. ఇలా డిస్కం జారీ చేసిన మీటర్లను దరఖాస్తు దారుని ఇంట్లో పెట్టకుండా విద్యుత్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంట్లో ఉంచారు. డిస్కం మంజూరు చేసిన మీటర్లకు ఆ మరుసటి నెల నుంచే రీడింగ్, బిల్లుల జారీ ప్రక్రియను చేపట్టాలి. అయితే ఫిబ్రవరి, మార్చి నెలలకు ఏ ఒక్క మీటర్‌కు రీడింగ్ నమోదు కాలేదు. ఏప్రిల్‌లో డిస్కం సిబ్బంది కాంట్రాక్టర్ ఇంటికి చేరకుని కనెక్షన్ ఇవ్వని ఖాళీ మీటర్లకు మినిమం బిల్లులు జారీచేశారు. రీడింగ్ మిషన్‌లో అమర్చిన జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో ఇలా కొల్లగొట్టిన మీటర్లను గుర్తించారు. ఈ సెక్షన్ పరిధిలో ఇప్పటివరకు 225 మీటర్లు జారీ చేయగా వీటిలో ఇప్పటికే భారీగా రీడింగ్ నమోదైన మీటర్లు కనిపించకుండా పోయినట్లు తెలిసింది. అయితే ఈ మీటర్లను గుర్తించడం ఎలా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ వ్యవహారం పూర్తిగా బయటకు వస్తే మరికొంతమంది అధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉంది. వాస్తవానికి చిత్రపురి కాలనీలో ఉన్న 225 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం 2021 ఆగస్ట్ 21న రిజిస్టర్ చేయగా 2025 జనవరి 7న మంజూరు చేశారు. ఈ మధ్యలో ఎస్టిమేట్‌లు రివైజ్ చేయడం, వినియోగదారుడు చెల్లించ డం వంటివి జరిగాయి. 2024 ఫిబ్రవరిలో ఎస్టిమేట్ క్లోజ్ చేశారు. అయితే ఇక్కడ మీట ర్ బిగించకుండా ఒకనెల బిల్లు రాకుండా ఎస్టిమేషన్ క్లోజ్ చేయడం గమనార్హం. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్లే మీటర్ల గోల్‌మాల్ జరిగిందని ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

**నిబంధనలకు విరుద్ధంగా కేటగిరీ మార్పు..!**

చిత్రపురి కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన విద్యుత్ మీటర్లు కేటగిరీ-1 కింద అలాట్ అయినట్లు తెలుస్తోంది. దాదాపు 225 మీటర్లు ఇవ్వాల్సి ఉండగా, మొదటి దశలో 42 మీటర్లు ఇచ్చినట్టుగా అధికారులు తెలిపారు. మరికొన్ని మీటర్లు కూడా మంజూరీ అయి బిల్లులు వస్తున్నాయని.. అయితే వీటిలో అత్యధికంగా బిల్లులు వస్తున్న వాటి జాడే లేకుండా పోయిందని డివిజన్‌కు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు. ప్రధానంగా కొంతమంది వినియోగదారుల ఇళ్లకు ఎన్ఓసీ లేకున్నా మొదటి కేటగిరీలో మీటర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఎన్ఓసి లేనప్పుడు కేటగిరీ–2 కింద మీటర్లు ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడు కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఒకవైపు మీటర్లు బిగించకుండా నిల్వ ఉంచడమే కాకుండా కేటగిరి మార్చడంతో విద్యుత్ సిబ్బంది తమ ప్రయోజనాల కోసం సంస్థ ఆదాయానికి గండికొట్టారని ఇప్పుడు డిస్కంలో జోరుగా చర్చ సాగుతోంది. అక్రమంగా నిల్వ ఉంచిన మీటర్లకు గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది బిల్లులు ఇచ్చారు. మీటర్ల గోల్‌మాల్ వ్యవహారంలో డిస్కం అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో మిలాఖత్ అయి ఈ దందా నడిపినట్లు సమాచారం. ఇప్పటివరకు 225 మీటర్లలో ఎన్ని మీటర్లు ఇచ్చారు.. అవి ఎక్కడ ఉన్నాయి. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే దిశగా డివిజన్ అధికారులు ఆరా తీస్తున్నా.. ఉన్నతస్థాయిలో మాత్రం వీటిపై ఎలాంటి సమాచారం లేదు. గచ్చిబౌలి డివిజన్‌కి సబంధించి విద్యుత్ మీటర్ల వ్యవహారంలో ఎవరూ తలదూర్చవద్దంటూ డిస్కంకు చెందిన ప్రధాన అధికారి నుంచి కిందస్థాయి అధికారులకు మౌఖికంగా ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

# ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ

సిటీ బ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం సైఫాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో 123 మంది దృష్టి వైకల్యం గల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలోని సెంటర్‌లో పరీక్ష తీరును పరిశీలించారు. జిల్లాలో మొత్తం 43,676 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా మొదటి సెషన్‌లో 26,032 మంది హాజరు కాగా 17, 644 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 2వ సెషన్‌లో 25,787 మంది అభ్యర్థులు హాజరుకాగా 17,889 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.

# 8న తెలంగాణ రన్

అమీర్‌పేట్, మే 25: యువతలో శారీరక చురుకుదనంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జూన్ 8న నెక్లెస్ రోడ్‌లో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అవంతిక కన్‌స్ట్రక్షన్స్ సమర్పణలో తెలంగాణ రన్నర్స్ సొసైటీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ రన్‌కు సంబంధించి తెలంగాణ రన్ ఫినిషర్ మెడల్, టీషర్టులను ఆదివారం బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తెలంగాణ రన్ సమర్పకులు, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ ఎండీఎం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.